
www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 25 మార్చి 2025

5


తిరుపతి



అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దాం:విసి

ప్రజాశక్తి - క్యాంపస్

ఎస్వీయూ కామర్స్ మేనేజ్మెంట్, కంప్యూటర్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 94 వ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉపకులపతి ఆచార్య సిహెచ్ అప్పారావు అమరవీరులకు నివాళులర్పించి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్ తదితరులు యువతకు స్ఫూర్తిదాయకమనీ, ఆ అమరవీరుల ఆశయాలను కొనసాగించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. వర్సిటీ మేనేజ్మెంట్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పివి నర్సయ్య మాట్లాడుతూ సమరయోధులు, అమరవీరులు చూపించిన తెగువ వల్లే ఈరోజు మనమందరం ఈ స్వాతంత్ర ఫలాలు అనుభవిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల విభాగ అధిపతులు అంజనబాబు, జయచంద్రరెడ్డి, రఘునాథ్ రెడ్డి, అధ్యాపకులు మునెయ్య, ఢిల్లీ బాబుకోటి, సుదేష్ణ, భార్గవ, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



టిటిడి ఛైర్మన్ బిఆర్నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్న పోటు కార్మికులు

టిటిడి బడ్జెట్ రూ.89 కోట్లు పెంపు

ప్రజాశక్తి -తిరుమల

టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్యక్షతన సోమవారం టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రూ. 5258 కోట్ల రూపాయల అంచనాతో టీటీడీ వార్షిక బడ్జెట్కు పాలకమండలి ఆమోదం తెలిపింది. హుండీ ద్వారా రూ. 1,729 కోట్లు ఆదాయం లభిస్తుందని పాలక మండలి అంచనా వేసింది. వడ్డీల ద్వారా రూ. 1,310 కోట్లు ఆదాయం లభిస్తుందని అంచనా వేశారు. ప్రసాదాల విక్రయం ద్వారా రూ. 600 కోట్లు, దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ. 310 కోట్ల ఆదాయం వస్తుందని వెల్లడించింది. జీతాల చెల్లింపుకు రూ. 1,774 కోట్లు కేటాయింపు, ముడిసరుకుల కొనుగోలుకు రూ. 768 కోట్లు, ఫిక్స్ డ్ డిపాజిట్ కు 800 కోట్లు, ఇంజనీరింగ్ పనులుకు రూ. 500 కోట్లు కేటాయించారు. అదేవిధంగా రాష్ట్రాల రాజధానుల్లో ఆలయాలు నిర్మించాలని నిర్ణయించింది. ఇతరదేశాల్లోనూ శ్రీవారి ఆలయాలు నిర్మించాలని టీటీడీ నిర్ణయం తీసుకుంది. త్వరలో వీఐపీ బ్రేక్ దర్శన వేళల్లో మార్పులు చేయాలని టీటీడీ నిర్ణయించింది.

టిటిడి ఛైర్మన్కు కృతజ్ఞతలు

తిరుమల అన్నమయ్య భవనంలో సోమవారం జరిగిన టిటిడి బోర్డు సమావేశంలో పోటు కార్మికులకు జీతాలు పెంపు, టిటిడి విద్యా సంస్థలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటుపై పోటు కార్మికులు, కాంట్రాక్ట్ లెక్చరర్లు టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులకూ సిఫార్సు లేఖల దర్శన సౌకర్యం కల్పించడంతో ఎస్డబ్ల్యుయుఎఫ్ ప్రధాన కార్యదర్శి కాటా గుణశేఖర్ హర్షం ప్రకటించారు.

టీటీడీకి రూ.16.67లక్షలు విరాళం

విజయవాడకు చెందిన ఎన్.శ్రీరామ్ ప్రసాద్ సోమవారం శ్రీవేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.10,01,116 విరాళంగా అందించారు. కాకినాడకు చెందిన ఎలైట్ ఇన్స్ట్రుమెంట్స్ మేనేజింగ్ పార్టనర్ సూర్య నారాయణ రెడ్డి రూ.6,66,000 టీటీడీకి విరాళంగా అందించారు. తిరుమలలోని అన్నమయ్య భవన్ లో టీటీడీ ఛైర్మన్ బీ.ఆర్.నాయుడుకు విరాళం డీడీలను అందజేశారు. ఈ సందర్భంగా దాతలను టీటీడీ ఛైర్మన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి పాల్గొన్నారు.



శ్రీ చెంగాలమ్మ హుండీ ఆదాయం రూ.23 లక్షలు



ప్రజాశక్తి-సూళ్లూరుపేట

సూళ్లూరుపేట శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి పరాకామణి(హుండీ లెక్కింపు) సోమవారం జరిగింది. 47 రోజులకు గాను రూ23,11,485లు నగదు, విదేశీ కరెన్సీ:- మలేషియా-1 రింగట్స్, యుఎస్ఏ డాలర్స్-20, కెనడా డాలర్స్ 20, బంగారం (గ్రా 95 మి.గ్రా210) వెండి (గ్రా 50 మి.గ్రా630) ఆదాయం చేకూరింది. ఈ కార్యక్రమములో దేవస్థానము సిబ్బంది, మెప్మా సభ్యులు, విశ్రాంతి బ్యాంకు ఉద్యోగులు, దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ సిహెచ్.శ్రీనివాస బాబు పర్యవేక్షణలో, సహాయ కమీషనరు, కార్యనిర్వహణాధికారి బి. ప్రసన్నలక్ష్మీ సమక్షంలో లెక్కింపు పూర్తయ్యింది.

మండుటెండలోనూ.. భారీగా అర్జీలు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 304 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఓ వైపు ఎండలు మండుతున్నా, అర్జీదారుల క్యూలైన్లు కలెక్టరేట్ వద్ద భారీగానే కనిపించాయి. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 304 అర్జీలు రాగా, అందులో రెవిన్యూ శాఖకు సంబంధించి 201 అర్జీలు ఉన్నాయి.

మా అర్జీ తీసుకోలేదు : తీగల రాజేశ్వరి, పుదూరు గ్రామం, నాయుడుపేట

'ప్రజా సమస్యలు పట్టించుకోవలసిన బాధ్యత కలిగిన ఉన్నత స్థాయి అధికారి అయ్యుండి మాకు సంబంధించిన భూమి సాగరమాల జాతీయ రహదారికి మాకు తెలపకుండా తీసుకున్న విషయమై నష్టపరిహారం, లేక సమాన భూమిని ఇవ్వాలని అర్జీ ఇవ్వడానికి వస్తే మీతో మాట్లాడను.... మీ అర్జీని తీసుకోము అని జాయింట్ కలెక్టర్ చెప్పడం చాలా బాధ వేస్తోంది. గడిచిన మూడు సంవత్సరాలుగా ఇదే విషయమై ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నాము. కుర్చీలో కూర్చున్న తనను వీరిని పంపేయండి అని ఆయన అనగానే కన్నీరు వచ్చింది' అని నాయుడుపేట మండలం పుదూరు గ్రామానికి చెందిన తీగల రాజేశ్వరి 'ప్రజాశక్తి'కి తెలిపారు. పుదూరు గ్రామ రెవిన్యూ లెక్క దాఖలా సర్వే నెంబర్ 31/3/4/5, 20/3/4/5/6/8లో ఎ1.80 సెంట్లు భూమి ఉందని, జాతీయ రహదారి నిర్మాణానికి తమ భూమి తీసుకున్న విషయమై నష్టపరిహార విషయంలో తేడాలు చూపడంతో కోర్టును ఆశ్రయించామన్నారు. ఇకనైనా తమ సమస్యను జిల్లా కలెక్టర్ పట్టించుకుని న్యాయం చేయాలని కోరుతున్నాం.

మా స్థలాలను ఆక్రమించడానికి యత్నిస్తున్నారు : గోవర్ధన్యాదవ్, సర్పంచి, అనుప్పల్లి

గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హయాంలో నిరుపేదలకు కేటాయించే జగనన్న కాలనీలో మాకు స్థలాలను కేటాయిస్తూ పట్టాలు ఇచ్చారు. ఇప్పుడు రామచంద్రపురం మండలం అనుప్పల్లి గ్రామానికి చెందిన అధికార పార్టీకి సంబంధించిన ఇద్దరు వ్యక్తులు దాదాపు 25 మంది లబ్దిదారులకు సంబంధించిన భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మాకు కేటాయించిన భూములను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

సొంత ఇల్లు, పింఛన్ సౌకర్యం కల్పించండి : రేణుక, ఎస్బిఐ కాలనీ

నేను ఆస్తమా పేషెంట్ ను. నా భర్త ఏడాది మునుపే చనిపోయారు. నా కుటుంబ ఆర్థిక పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. ఎవరో ఒకరు సహాయం చేస్తే తప్ప పిల్లలకు కనీసం అన్నం పెట్టలేని పరిస్థితుల్లో ఉన్నాను. నాకున్న ఆరోగ్య సమస్యకు మందులు కొనడానికి కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను. సొంత ఇల్లు లేక బాడుగ ఇంట్లో ఉంటున్నాను. బాడుగను సకాలంలో చెల్లించకపోవడంతో ఇంటి యజమానులు ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోమంటున్నారు. సొంత ఇల్లు, పింఛన్ సౌకర్యం కల్పిస్తే నా పిల్లలు కన్నా, చామంతిలను చదివించుకుంటాను. అధికారులు నా కుటుంబం పట్ల దయవుంచి సొంత ఇల్లు, పింఛన్ సౌకర్యాన్ని కల్పించాలని వేడుకుంటున్నాను. తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ కు అర్జీలు ఇచ్చాను. ఇప్పుడు కలెక్టర్ ఆఫీసులో ఇచ్చాను.

కార్పొరేషన్కు 59 వినతులు

తిరుపతి టౌన్ : తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు 59 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. ఫోన్ ద్వారా 8 మంది తమ సమస్యలు తెలుపగా, 51 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు. డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ , కార్పొరేటర్ రాధాకష్ణ పాల్గొని పెండింగ్ లో ఉన్న టి.డి.ఆర్. బాండ్లు వెంటనే మంజూరు చేసేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్ ఉన్నారు.

సకాలంలో పన్నులు వసూలు చేయండి

తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో అన్ని పన్నులు సకాలంలో వసూలు చేయాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. పన్నుల వసూళ్ల, స్వచ్ఛ సర్వేక్షన్ లో ర్యాంకింగ్, నగరంలో మెరుగైన పారిశుద్ధ్యం తదితర అంశాలపై అన్ని విభాగాల అధికారులతో కమిషనర్ సోమవారం సమావేశం నిర్వహించారు. ఎక్కువ మంది పన్నుల మినహాయింపు వస్తుందనే ఉద్దేశ్యంతో చెల్లించడం లేదని అధికారులు తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న స్వచ్ఛ సర్వేక్షన్ ప్రజల మొబైల్స్ ద్వారా మంచి అభిప్రాయంతో ఓటింగ్ వేసేలా అవగాహన కల్పించాలని అన్నారు. తద్వారా తిరుపతిని మొదటిస్థానంలో నిలిపేందుకు వీలుంటుందని అన్నారు. నగరంలోని తిరుమల బైపాస్ రోడ్డు లోని 47 వ నంబర్ పిల్లర్ వద్ద భూగర్భ డ్రైనేజీ కాలువ మరమ్మత్తులు చేయనుండడం వలన వాహనాల రాకపోకలకు అంతరాయం కలగనుందని కమిషనర్ తెలిపారు. ఐదు రోజులపాటు వాహనాల రాకపోకలకు అంతరాయం కలగనుంది. కావున వాహన చోదకులు, ప్రజలు సహకరించాలని కమిషనర్ ఆ ప్రకటనలో కోరారు. ఈ మరమ్మత్తు పనులను పోలీసు అధికారులతో కలసి మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, డి.ఈ. లలిత పర్యవేక్షిస్తున్నారు.

శెట్టిపల్లి జీవో విడుదల చేయాలి

డిఆర్ఓకు సిపిఎం వినతి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్




శెట్టిపల్లి భూ సమస్య పరిష్కరించడానికి జీవో తీసుకురాకుండా కాలయాపన చేయడం వల్ల మూడు వేల మంది బాధితులు తీవ్ర వేదనకు గురవుతున్నారని డిఆర్ఒ శ్రీనివాసులుకు సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు వినతిపత్రం సమర్పించారు. కూటమి ప్రభుత్వం శెట్టిపల్లి సమస్యను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యిందన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ చేసి భూమిని తుడాకు అప్పగించింది. తర్వాత వచ్చిన ప్రభుత్వం తుడా నుండి నుండి మున్సిపాలిటీకి మార్చింది. ఈ ప్రభుత్వ ఏర్పడిన తర్వాత టీడీపీ ఇచ్చిన జీవోను తీసుకురావడానికి ఇన్ని రోజులు పడుతున్నదంటే ఏమనాలో అర్థం కాని పరిస్థితి అని చెప్పారు. బాధితులు పదేపదే జిల్లా కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నప్పటికీ, తిరుపతి శాసనసభ్యులు అసెంబ్లీలో ప్రస్తావించినప్పటికీ సమస్య ముఖ్యమంత్రి దష్టికి తీసుకెళ్లినప్పటికీ జీవో జారీ చేయడంలో ఎందుకంత ఆలస్యం అవుతున్నదో అర్థం కావడం లేదన్నారు. ఇప్పటికైనా మార్చి 25, 26 తేదీల్లో జరుగుతున్న జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఈ జీవోను తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. లేనియెడల ఏప్రిల్ నుండి దశలవారి పోరాటం చేయవలసి వస్తుందని హెచ్చరించారు. అజీమ్బాష పాల్గొన్నారు.

16 నెలల అరియర్స్ ఇవ్వకపోవడం దారుణం

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల రిలేదీక్ష

ప్రజాశక్తి - తిరుపతి సిటి

'ప్రమాదాలతోనే మా విధులు ముడిపడి ఉంటాయి.. అయినా మమ్మల్ని రెగ్యులర్ చేయడం లేదు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదు. ఆఖరికి 16 నెలల అరియర్స్ ఇవ్వలేదు.. అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. చివరకు డిస్కం సిఎండి కనీసం మా బాధను వినే సమయం కూడా కేటాయించలేదు..ఈ కారణంగానే దీక్షలు చేస్తున్నాం..' అని విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు వాపోయారు. ఏప్రిల్ ఏడో తేదీ వరకూ వేచి చూస్తామని, తమ సమస్యలు పట్టించుకోని పక్షంలో డిస్కం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు రిలే నిరాహారదీక్షలు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ ట్రూఅప్ ఛార్జీల పేరుతో వినియోగదారులను బాదుతూ, కార్పొరేట్లకు కట్టబెడుతున్నారన్నారు. కార్మికులకు ఏమైనా చేయాలంటే అప్పులు చూపిస్తున్నారన్నారన్నారు. ప్రభుత్వ సంస్థల్లో పర్మినెంట్ అనేది కనుమరుగయ్యిందన్నారు. 2019 నుంచి 24 వరకూ పోరాటాలు చేస్తూనే ఉన్నా, తమ గోడు పట్టించుకోలేదని వాపోయారు. తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్, రాష్ట్ర నాయకులు నాయబ్ రసూల్, కిరణ్ కుమార్, శివశంకర్, శివ ప్రసాద్ రెడ్డి, కడప జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాసులు రెడ్డి , తిరుపతి జిల్లా సిఐటియు కార్యదర్శి జయచంద్ర, ఐఎన్టి సి ప్రధాన కార్యదర్శి ఆర్ మురళీధర్ పాల్గొన్నారు.



కాంట్రాక్టు కార్మికులనుద్దేశించి ప్రసంగిస్తున్న కందారపు మురళి

తిరుచానూరు పార్కింగ్ టెండర్ 'కూటమి'కే..

టెండర్ దారుల నుండి డీడీలను లాక్కున్న వైనం జరుగుతున్న తంతును ప్రేక్షకుల్లా వీక్షించిన పోలీసులు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

తిరుపతి రూరల్ మండలంలోని వైశాల్యంలో పెద్ద పంచాయతీగా నిలిచిన తిరుచానూరు గ్రామపంచాయతీ పార్కింగ్ టెండర్ లో కూటమి నేతలు దౌర్జన్యం ప్రదర్శించి ఓపెన్ టెండర్ ద్వారా మూడు కోట్ల 51 లక్షలకు కూటమి నాయకుడు వెంకటేష్ టెండర్ తగ్గించుకున్నారు. ఎన్నడూ లేని విధంగా తిరుచానూరు పార్కింగ్ టెండర్ లో కిలోమీటర్ మేర పోలీసులు ఆంక్షలు విధించారు. సీల్డ్ టెండర్లు దాఖలు చేయడానికి వచ్చే ఔత్సాహికుల నుండి బలవంతంగా డీడీలను లాక్కొని వెళ్తున్నా పోలీసులు పట్టించుకోకపోవడం, కూటమి నేతల తంతును ప్రేక్షకుల్లా వీక్షిస్తుండడాన్ని అక్కడివారు తప్పు బట్టారు. నాలుగు గంటలకు టెండర్ ఎవరు దక్కించుకున్నారో ప్రకటన అయిన తరువాత డీడీలు ఇస్తారని చూస్తే, సాయంత్రం 6 గంటల సమయానికి కూడా పొద్దున బలవంతంగా తీసుకెళ్లిన 40 లక్షల విలువ గల డీడీలను తిరిగి ఇవ్వలేదని బాధితులు దూర్వాసుల రెడ్డి, దేవేందర్ రెడ్డి మీడియాతో వాపోయారు. సాధారణంగా ఈ టెండర్ విషయంలో పెద్దగా ఆసక్తి చూపని స్థానిక తిరుచానూరు ప్రజలు కూడా ఈసారి ఏమి జరుగుతుందో అని ఆందోళనకరంగా ఎదురుచూసిన పరిస్థితి నెలకొంది. పార్కింగ్ టెండర్ విషయంలో ఎన్నడూ లేని విధంగా తిరుపతి రూరల్ మండలం నుండి కూటమి పార్టీల నాయకులు 500 మంది తిరుచానూరు చేరుకున్నారని, పోలీసులు కూడా వందమందిపై బడి ఓ టెండర్ ప్రక్రియకు హాజరవ్వడం ఇదే మొదటిసారి అని తిరుచానూరు ప్రజలు గుసగుసలాడుతున్నారు. 2024-25లో2 కోట్ల 89 లక్షల 6వేల రూపాయలు వచ్చింది. ఈ ఏడాదితో పోలిస్తే పంచాయతీకి 61 లక్షల 94వేలు ఆదాయం వచ్చింది. ఈవో పీఆర్డి మాధురి పర్యవేక్షించారు.



తిరుచానూరు పార్కింగ్ టెండర్ వద్ద భారీగా మోహరించిన నేతలు, పోలీసులు

ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా వసతుల కల్పన




ప్రజాశక్తి -సత్యవేడు

పిల్లలకు చదువుతో పాటు ఆటలు ఎంతో ముఖ్యం అని గుర్తించిన శ్రీసిటీ ఫౌండేషన్, స్థానిక పరిశ్రమలు సహకారంతో పరిసర ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల వద్ద పలు క్రీడా వసతుల కల్పనపై దష్టి సారించింది. ఇందులో భాగంగా ఇటీవల శ్రీసిటీ పరిధిలోని మాదనపాలెం, ఇరుగుళం జడ్పి హైస్కూళ్లు, రామచంద్రపురం, గొల్లవారిపాలెం, వానెల్లూరు ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలు ఆడుకునేందుకు వీలుగా క్రీడా వసతులను కెలాగ్స్ పరిశ్రమ సహకారంతో ఏర్పాటు చేసింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత చర్యల్లో భాగంగా సుమారు ఎనిమిది లక్షలు వెచ్చించి, చిన్న పిల్లలు ఎంతో ఇష్టంగా ఆడుకునే ఊయల, జారుడుబండ, తిరుగుడు బల్ల (మెర్రిగో), సీస వంటి ఇతర పలు ఆట వస్తువులను అమర్చారు.

వ్యాపారులకు జీఎస్టీ చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన బడ్జెట్తో పాటు, జీఎస్టీ చట్టాలపై అవగాహన చేసుకుని పన్నులు చెల్లించాల్సి ఉంటుందని ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ ఫాల్గుణకుమార్ అన్నారు. ఓ ప్రైవేట్ హోటల్లో ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్, తిరుపతి జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో 2025 -26 కేంద్ర బడ్జెట్ నూతన చట్టాలు, జీఎస్టీ చట్టాలపై వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు తిరుపతి జిల్లా చాంబర్ కామర్స్ జిల్లా అధ్యక్షులు కే వి చౌదరి అధ్యక్షత వహించారు. వ్యాపారులు ఒక రోజుకి పదివేలకు మించి ఖర్చు చెల్లింపు చేయరాదన్నారు. అన్ని ఆర్థిక లావాదేవీలకు తగిన రసీదులు ,సాక్ష్యాలు తీసుకొని లెక్క పుస్తకాలతో రోజు వారు నమోదు చేయాలని అన్నారు. ఆ లెక్కల పుస్తకాల రసీదులను ఏడు సంవత్సరాల వరకు భద్రపరిచి అడిగినప్పుడు అధికారులకు చూపించాలన్నారు. జీఎస్టీ పోర్టల్ లో మీ పేరున నోటీసులు పన్ను డిమాండ్లు ఏమైనా ఉన్నాయో ప్రతి వారం పరిశీలించాలన్నారు. సమావేశంలో వ్యాపారులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు తిరుపతి, శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట, సత్యవేడు, పుత్తూరు, నాయుడుపేట, వెంకటగిరి నుంచి వ్యాపారస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తిరుపతి జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి కే రఘురామిరెడ్డి, ట్రెజరర్ ప్రసాదరావు, వైస్ ప్రెసిడెంట్ టి సుబ్బరామ గుప్తా, కే రాజేంద్రన్, జాయింట్ సెక్రెటరీ ఎం వెంకటేశ్వర్లు, ఏ బాలాజీ, సభ్యులు పి చంద్రశేఖర్, ఏ సురేష్ పాల్గొన్నారు.

'టేప్' నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి కుంట్లపాకం తనపల్లి, ది అసోసియేషన్ ఆఫ్ ప్లానర్స్ అండ్ ఇంజనీర్స్ తిరుపతి సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. 'టేప్' కార్యవర్గ ఎన్నికలలో ఛైర్మన్ గా టి. వెంకటేష్ బాబు, ప్రెసిడెంట్ గా ఎం. ప్రసాద్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్స్ గా పి.నాగేశ్వరరావు, ఏ. సుధాకర్ రెడ్డి, సెక్రటరీగా బి. షణ్ముగం, ట్రెజరర్గా సందీప్, జాయింట్ సెక్రటరీలుగా శివశంకర్ రెడ్డి, బంగారయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నరేష్, వెల్ఫేర్ సెక్రటరీగా సురేష్, ఈసీ సభ్యులుగా శ్రీనివాస మూర్తి, ఎం.ఎస్. శంకర్, వసంతరావు, శివకుమార్, ఆర్.ఆర్. శ్రీనివాస్, కిషోర్ కుమార్, సురేష్ బాబు, విద్యాసాగర్, మణికంఠ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జులై 12, 13 తేదీల్లో పిఎల్ఆర్ కన్వెన్షన్ తిరుపతిలో జరగనున్న టేప్ ఎక్స్పో 25 బ్రోచర్ను ఆవిష్కరించారు. ఎస్ వి ఇంజనీరింగ్ కాలేజ్ సివిల్ హెడ్ ఆఫ్ డిపార్ట్మెంట్ డాక్టర్ చిత్తరంజన్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ అందించి విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందించి మంచి ఇంజనీర్లుగా తయారవ్వడానికి దోహదపడుతుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘం డబ్ల్యూ ఏ ఎల్ టి పి నాయకులు జనరల్ సెక్రెటరీ లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీ జయ ప్రకాష్, రాష్ట్ర అడ్వైజరీ కమిటీ మెంబర్స్ నాగ శ్రీనివాస్, మదన గోపాల్ పాల్గొన్నారు.

దళితుల బాట ఆక్రమణలు తొలగించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పిచ్చాటూరు

దళితుల బాట ఆక్రమణలను తొలగించాలని సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్ మాట్లాడుతూ గోవర్ధనగిరి రెవెన్యూలో సర్వే నంబర్ 67, 68ల్లో ఓబులరాజుకండ్రిగ దళితులు 48 మందికి ప్రభుత్వం పట్టాలిచ్చి బాట సౌకర్యం కల్పించిందన్నారు. అయితే ఈ బాటను గోవర్ధనగిరి గ్రామానికి చెందిన వైసిపి లీడర్ బాలాజీనాయుడు దౌర్జన్యంగా ఆక్రమించి ఫెన్సింగ్ వేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై రెవెన్యూ సదస్సుల్లో అర్జీ ఇవ్వగా సర్వే చేసి బాట ఆక్రమణకు గురయ్యిందని నిర్ధారించారని, ఫెన్సింగ్ మార్చుకోవాలని బాలాజీనాయుడుకు సూచించినా లెక్కబెట్టలేదని అన్నారు. సర్వే చేసి నెల దాటినా దళితులకు బాట సౌకర్యం కల్పించలేదన్నారు. వెంటనే ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేశారు. తహశీల్దార్ సుబ్రమణ్యంకు, ఎస్ఐ వెంకటేష్కు వినతిపత్రం ఇచ్చారు. ఆక్రమణలు తొలగిస్తామని ఎస్ఐ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో నాగలాపురం నాగరాజు, రామచంద్రారెడ్డి, మాతయ్య, బాబు, సుబ్బమ్మ, కన్నమ్మ పాల్గొన్నారు.



కవర్లతో నాణ్యమైన మామిడి

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: మామిడిలో నాణ్యమైన దిగుబడి, మంచి ధర పలకాలంటే కాయలకు కవర్లు తప్పనిసరిగా కట్టాలని, కవర్లకు ఉద్యానశాఖ రాయితీ అందిస్తోందని మండల ఉద్యానశాఖాధికారి పి.శివకుమారి మామిడి రైతులకు సూచించారు. సోమవారం ఆరికెలవారిపల్లి, గోటూరువారిపల్లి, భాకరాపేట, దంగస్యగారిగడ్డ గ్రామాలలోని మామిడి పంటలను పరిశీలించారు. మామిడి కాయలకు కవర్లు కట్టడంవల్ల ఎటువంటి క్రిమి కీటకాలు, అధిక సూర్య రశ్మి, వడగండ్ల వాన పండ్లను నాశనం చేయలేవు, ఎటువంటి పురుగు మందుల వాడకం అవసరం లేదన్నారు. వివరాలకు ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించాలని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



బాధితులకు చెక్కులు అందచేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు నియోజకవర్గంలోని 10 మంది బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ మొత్తం రూ.12,56,638/- మంజూరయ్యింది. సోమవారం ఆ చెక్కులను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి అందించారు. సత్యవేడు మండలం: ఎం. చంద్ర 1,95,999/-, డి.శివ. 53,333/-, ఎం.ఈశ్వరయ్య 51,512/-, సి.నాగయ్య 1,97,819/-, నారాయణవనం మండలం టీ.కే. దొరైరాజ్ - 30,000/-, ఏ.కే.మలర్ కోడి 1,55,138/-, వరదయ్యపాలెం మండలం జి.మారెయ్య 1,00,000/-, బి.అరుణ 2,00,000/-, బుచ్చినాయుడు కండ్రిగ మండలం పి.మురళినాయుడు-189523/-, కేవిబి పురం మండలం ఎన్.గౌతమి 83,314/-రూపాయలకు మొత్తం - 12,56,638/- రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రజాశక్తి - గూడూరు టౌన్ :



బాధితులకు చెక్కులు అందచేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

గూడూరు నియోజకవర్గంలో దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడే వారికి సీఎం సహాయ నిధి నుండి వైద్యం కొరకు నిధులు మంజూరు చేస్తున్నారని, సమస్యలు ఉన్నవారు సీఎం సహాయ నిధి కొరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంప్రదించాలని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ కోరారు. ఈ సందర్భంగా ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ నుండి మంజూరైన 26 లక్షల 32 వేల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం కిరణ్ కుమార్, భాస్కర్ రెడ్డి, బిల్లు చెంచురామయ్య, రహీం, మట్టం శ్రావణి , తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీటి కాలువను శుభ్రపరచండి



ప్రజాశక్తి- వెంకటగిరి టౌన్ : వెంకటగిరి మున్సిపాలిటీ, 14 వ వార్డు, నరసింహారావు వీధి, పుల్లయ్య బడికి వెనకాల ఉన్నటువంటి పెద్ద మురుగు నీటి కాలువ చెత్త చెదారాలతో నిండిపోయింది. నెలలు తరబడి చెత్త తొలగించక దోమలు వృద్ధి చెంది పరసర ప్రజలకు విష జ్వరాల పాలవుతున్నారు. దుర్వాసన తో పరసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. అధికారులు జోక్యం చేసుకుని కాలువ శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

మాజీ సర్పంచ్ మృతికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - పిచ్చా టూరు: నారాయణవనం మండలం, సముదాయం మాజీ సర్పంచ్ వల్లియమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సోమవారం ఉదయం వల్లియమ్మ స్వగృహానికి చేరుకుని ఆమె భౌతికకాయానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు త్వరగా పరిష్కరించండి

ప్రజాశక్తి - రామచంద్రాపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి వివిధ సమస్యలపై వచ్చిన వినతులను, రెవెన్యూ సిబ్బంది విచారణ చేసి, రికార్డులను పరిశీలించి త్వరగా పరిష్కరించాలని తహసిల్దార్ కే వెంకట రమణ సూచించారు. సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. పోలీస్, రెవెన్యూ, విద్యాశాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు త్వరగా పరిష్కరించాలని, రేషన్ కార్డుల ఈ కేవైసీ 100 శాతం పూర్తి చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎం.అన్వర్ భాష, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ అమృత, మండల సర్వేయర్ రమేష్ బాబు, మండల విద్యాశాఖ అధికారి మార్కండేయనాయుడు, హౌసింగ్ ఏఈ మహేష్ నాయుడు, ఇరిగేషన్ ఏఈ ఎత్తి రాజులు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ పవన్ రాజు. ఆర్ ఐ లక్ష్మీనారాయణ, వీఆర్వోలు ఝాన్సీ, శ్రీనివాసులు, మల్లికార్జున్, ప్రదీప్ నాయుడు, నరసింహులు, వెంకటరమణ, గుణ భూషణ్ నాయు డు, కమ్యూనిటీ సర్వేయర్ మణి రెవెన్యూ సిబ్బంది, పాల్గొన్నారు.

శ్మశానాన్ని కబ్జా నుంచి కాపాడండి : సిపిఎం



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం, నేసనూరు పంచాయతీ చెందిన గట్టువడ్డిండ్ల స్మశానాన్ని భూకబ్జాదారుల ఆక్రమణ నుండి కాపాడాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం పుత్తూరు తాసిల్దార్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ పుత్తూరు కార్యదర్శి ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ నేసనూరు లెక్క దాఖలా, సర్వే నెంబర్ 605లో భూమిని వందకు పైగా వడ్డిండ్లు కుటుంబాలు చాలా సంవత్సరాలుగా స్మశానంగా ఉపయోగిస్తున్నారు. ఇప్పుడు ఆ స్మశానాన్ని భూకబ్జాదారుడు సునీల్ ఆక్రమించడానికి కబ్జా చేస్తున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ తరపున డిమాండ్ చేశారు. సర్వే నిర్వహించి, హద్దులు ఏర్పాటు చేసి, స్మశానానికి రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. గట్టు వడ్డిండ్ల పక్కన దాదాపు 20 కుటుంబాలు కాపురాలు ఉంటున్నాంని, వారు రోడ్డు లేక పొలాలపై నడుస్తున్నారని, రోడ్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తాహశీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు. ఆయన స్పందించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చంగమ్మ, లీలావతి అమ్మ, నిర్మల, నవీనీతమ్మ, కిష్టప్ప, వెంకటేష్, బాల, శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎండిపోతున్న కూలీలు





ఎండలోనే పనిచేస్తున్న మహిళలు

మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలి



గతంలో టిడిపి ప్రభుత్వంలో పొదుపు సంఘాల ద్వారా ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు ఇచ్చేవారు. అయితే వైసిపి పాలన ఉన్న సమయంలో గుడారాలు, ప్రథమ చికిత్సకిట్లు, మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వాటిని తిరిగి ప్రారంభించాలి.

- ఉపాధి కూలీ రంగమ్మ

ఎండలకు అల్లాడుతున్న కూలీలు



ఫిబ్రవరి నెల నుండి ఎండలు బాగా పెరిగా యి. ఎండలకు అల్లాడిపోతున్నాం. గూడారాలు, ప్రథమ చికిత్సకిట్లు, తాగు నీరు, మజ్జిగ పనులు జరిగే ప్రదేశంలో ఏర్పాటు చేయాలి. కూలీలు ఎండ వేడి తట్టుకోలేక చెట్లు కిందకు వెళ్తున్నారు. గుడారాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

- సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు

వసతులు కల్పిస్తాం



ఉపాధి కూలీలకు పనుల వద్ద మౌలిక వసతులు కల్పిస్తాం. పనుల వద్ద గుడారాలను ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనను పంపుతాం. కుండలను ఏర్పాటు చేసి త్రాగునీటి సౌకర్యాన్ని కల్పిస్తాం. ప్రథమ చికిత్స కిట్లను అందిస్తాం. కూలీలకు వడదెబ్బ తగలకుండా ఉదయం 6 నుండి 9 గంటల వరకు పనిచేయించి. మిగిలిన పనిని సాయంత్రం చేయిస్తాం.

- పి.డి శ్రీనివాస్ ప్రసాద్



ప్రజాశక్తి - కేవీబీపురం: వేసవి ప్రారంభం కాగానే ఎండలు మండుతుండటంతో ఉపాధి పనులకు వెళ్లే కూలీలు తల్లడిల్లిపోతున్నారు. ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్న పట్టికి ఉపాధి కూలీలకు వసతులు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. జిల్లా వ్యాప్తంగా గతంలో వచ్చిన గూడారాలు, ప్రథమ చికిత్స కిట్లు అడ్రస్ లేకుండా పోయాయి. పనుల వద్ద ఉపాధి కూలీలు సేద తీరేందుకు గుడారాలు, ప్రథమ చికిత్స కిట్లు గతంలో ఇచ్చేవారు. అయితే వైసిపి పాలనలో ఇవన్నీ కానరాకుండా పోయాయి. మండల వ్యాప్తంగా ఉన్న జాబ్ కార్డులు 9800 ఉండగా, అందులో పనిచేసేవారు1700 మంది కూలీలు ఉన్నారు. వీరికి ఇప్పటి వరకు 70 రోజు వేతనాల చెల్లింపులు నిలిచిపో యాయి. మండలంలోని 39 పంచాయితీల్లో పని చేస్తున్న కూలీలకు రావాల్సిన వేతనాలు సుమారు 26 లక్షల రూపాయలు చెల్లించవలసి ఉందని అధికారులు చెబుతున్నారు. కూలీలకు ప్రభుత్వం ఉపాధి చేయవలసిన గడ్డపారలు కూడా అంద లేదు. అధికారులు స్పందించి ఉపాధి పనుల వద్ద గడపారలు, ప్రథమ చికిత్స కిట్లు, మజ్జిగ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కూలీలు కోరుతున్నారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు పనిచేస్తున్నా కూలి గిట్టు రావడంలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్రైం న్యూస్

అనుమానంతో వ్యక్తిపై దాడి

ప్రజాశక్తి -ఏర్పేడు: ఆదివారం సాయంత్రం, మండలంలోని సిద్ధయ్యగుంట గ్రామ సమీపంలో వ్యవసాయ పొలం వద్ద మహేష్ (రాజా) (35) అదే గ్రామానికి చెందిన రవితేజ (23)పై దాడిచేసి కత్తితో ఎడమ చేయి భుజం మీద నరికి రక్త గాయాలు చేశాడు. తన భార్య విషయంలో రవితేజ ప్రవర్తనపై అనుమానం వచ్చి మహేష్ దాడికి పాల్పడ్డాడని సమాచారం. ఈ నేపథ్యంలో తన భార్య పుట్టింటికి వెళ్లడంతో, రవితేజపై మహేష్ కక్ష పెంచుకున్నాడు. మహేష్ తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ జయచంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - నాగలాపురం: బీడీనాగలాపురం మండలంలోని కాంజేరి కాలనీ చెందిన 17 సంవత్సరాల అమ్మాయిపై అదే కాలనీకి చెందిన శరత్ (23) అనే యువకుడు అత్యాచారం చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కాంజేరి ఎస్సీ కాలనీకి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని ప్రలోభపెట్టి శరత్ పలుమార్లు అత్యాచారం చేశాడు. పెళ్లి చేసుకోమని అమ్మాయి కోరగా నిరాకరించాడు. ఈ విషయాన్ని బాలిక తన తల్లికి చెప్పడంతో, గ్రామ పెద్దల సమక్షంలో మధ్యవర్తిత్వం జరిగింది. ఆ సమయంలో బాలిక నడవడిక సరిగ్గా లేదని, ఆమె మంచిది కాదని పెళ్లి చేసుకోవడానికి చరణ్ నిరాకరించాడు. దీంతో ఆవేదనకు గురైన బాలిక తల్లి సులోచన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా కోట వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, నరసయ్యగుంట ప్రాంతానికి చెంది కోట వెంకటేశ్వర్లు గూడూరు డివిజనల్ లెవెల్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన గూడూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌ని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

వలస పిల్లలు.. పాఠశాల బాట

ప్రజాశక్తి - ఓజిలి : జీవనోపాధి కోసం మైసూర్ నుండి వలస వచ్చిన కుటుంబాల పిల్లలను ఓజిలి ఎంఈఓ శైలజ గుర్తించి సోమవారం ఉదయం పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుండి జీవనోపాధి కోసం కొన్ని కుటుంబాలు ఓజిలి మండలంలోని రాజుపాలెం గ్రామానికి వలస వచ్చాయని తెలిపారు. వారి కుటుంబాలలోని 12 మంది బడి బయట పిల్లలను గుర్తించి ప్రాథమిక పాఠశాలలో చేర్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆదినారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తే పీడీ యాక్ట్ : సుబ్బరాయుడు



జైలుకు తరలిన శివమణి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అడవుల నుండి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తే వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని టాస్క్ ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు హెచ్చరించారు. ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో ముద్దాయి అయిన తమిళనాడు రాష్ట్రంకు చెందిన శివమణి గోవిందం అలియాస్ శివమణిపై పీడీ యాక్ట్ అమలుకు ఆదేశాలు జారీ అయ్యాయని టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు. శివమణిని కోర్టు ఆదేశాల మేరకు కడప సెంట్రల్ జైలుకు తరలించామని తెలిపారు.

ఘనంగా హోం శాఖ మంత్రి జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాష్ట్ర హోమ్ శాఖా మంత్రి వంగలపూడి అనిత జన్మదిన వేడుకలు సోమవారం పట్టణవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. పట్టణంలో పలుచోట్ల అన్నదానాలు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ యువసేన అధ్యక్షులు మన్నేపల్లి ఈశ్వర్, పట్టణ యువసేన అధ్యక్షులు పాలూరి వెంకటముని పాల్గొన్నారు.

అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి ఆర్థిక సాయం వరం

ప్రజాశక్తి - రామచంద్రపురం (తిరుపతి రూరల్) పేద ప్రజల ఆరోగ్య సంరక్షణ ఇతర ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి రూ.17 లక్షల 50 వేల రూపాయల చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే పులివర్తి నాని పంపిణీ చేశారు. సోమవారం తనపల్లి రఘునాథ్ రిసార్ట్స్, టీడీపీ కార్యాలయంలో వివిధ మండలాలకు చెందిన బాధితులకు చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆరి లీలా మోహన్ నాయుడు, మేకల తిరుమలరెడ్డి, కే నరసింహారెడ్డి, కోరా హరి ప్రసాద్, బీసీ సెల్ నాయకుడు మాదాసు మాధవయ్య, మురళి రెడ్డి, ఎస్ఎస్సి అధ్యక్షుడు చిరంజీవి తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా బాడీ బిల్డర్లకు బహుమతులు ప్రదానం



ప్రజాశక్తి -తిరుపతి సిటీ : తిరుపతి జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల సంయుక్తంగా ఏడవ పురుషుల బాడీ బిల్డింగ్, మహిళల బాడీ బిల్డింగ్, మహిళల మోడలింగ్ పోటీలు సోమవారం నిర్వహించారు. స్థానిక యూత్ హాస్టల్లో జరిగిన కార్యక్రమానికి గోల్డెన్ ఇండియా బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు, తిరుపతి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెన్ ఫిజిక్, విమెన్ ఫిజిక్ పోటీలు జరగడం వలన పురుషులు, మహిళల్లో అవగాహన పెరిగి, వారి శారీరక సౌష్టవంతో పాటు దేహదారుఢ్యానికి ఉపయోగపడుతుందని అన్నారు. మెన్ ఫిజిక్, ఉమెన్ ఫిజిక్ విభాగాల్ని బాడీ బిల్డింగ్ అసోసియేషన్ లో చేర్చడం అభినందనీయమని అన్నారు. బాడీ బిల్డింగ్ పోటీలలో ఎస్ మనీ, ప్రసన్న కుమార్ రెడ్డి ఆదినారాయణ నవీన్ రోహిత్ విగ్నేష్ విజేతగా నిలిచారు మెన్ మోడలింగ్ లో ఆదిత్య, విమెన్ మోడలింగ్ లో పోటీలలో నికిత, గాయత్రి , భావన ,సిమ్రాన్, విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ శివప్రసాద్, అధ్యక్షులు ఈశ్వర ప్రకాష్, రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీరాములు పాల్గొన్నారు.

డ్రైనేజి, రోడ్లు ఏర్పాటు చేయండి



బాటిళ్లలో మురుగు నీరు తెచ్చి నిరసన తెలుపుతున్న దృశ్యం

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని 18 వ వార్డు భూప య్య గిరిజన కాలనీలో ఇళ్ల మధ్య కాలవలు సరిగా లేక మురికి నీరు నిలబడుతోంది. దీంతో దోమలు బెడద ఎక్కువయింది. అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టిం చుకోకపోవడం లేదని భూపయ్య కాలని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వారు ఇళ్ళ ముందు నిలిచిన మురికి నీటిని బాటిళ్లలో ఎత్తుకొని మున్సిపల్ కార్యాలయం వద్ద సిపిఎం నాయకుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. భూపయ్య కాలనీ గిరిజను లు, సిపిఎం నాయకులు మున్సిపాలిటీ కార్యాలయం వద్దకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు శివకవి ముకుంద మాట్లాడుతూ భూపయ్య కాలనీలో గిరిజనులు ఎన్నో సంవత్సరాలుగా నివసిస్తున్నారని, వసతులు లేక ఇబ్బంది పడుతున్నా రన్నారు. ఒక వీధికి మురికి నీరు కాలువ ఏర్పాటు చేసినప్పటికీ, నీరు పోవడం లేదని, ఆ కాలవలో మురికి నీరు నిలవ ఉంటున్నాయన్నారు. మరో వీధిలో కాలువలు లేకపోవ డంతో ఇళ్ళ ముందు ఇంకుడు గుంటలు లోడి, ఆ గుంటల్లో మురికి నీరు స్టోరేజీ చేసుకుం టున్నారని తెలిపారు. నాయకులకు ఎన్నికల సమయంలోను, మున్సిపాలిటీ అధికారు లకు పన్ను వసూళ్లకు మాత్రమే కాలనీ వసులు గుర్తొస్తారని ఎద్దేవా చేశారు. అనంతరం సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. స్పందించిన కమిషనర్ గిరిజన కాలనీలో రోడ్డుపై నిలవ ఉన్న మురికి నీరు పోవడానికి ఏర్పాటు చేస్తామని, మరో వీధికి కాలువలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మహిళా సంఘం నాయకులు చంద్రకళ, గిరిజనులు రాజేశ్వరి, పరమేశ్వరి, వెంకటేశ్వర్లు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శకాల మేరకు ఓటరు జాబితా సిద్ధం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సూచనలు సలహాలు చాలా విలువైనవని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు బియల్ఓలు డోర్ టూ డోర్ వేరిఫికేషన్ చేసిన తర్వాతనే తుది ఓటరు జాబితా 6 జనవరి 2025 విడుదల చేయడం జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా తయారీ, తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డి ఆర్ ఓ మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులు ఇచ్చే సూచనలను సలహాలను ఈసీకి పంపడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో మొత్తం ఓటర్లు - 18,04,229 మంది, 8,78,321 మంది పురుషులు,9,25,735 మంది స్త్రీలు,173 మంది థర్డ్ జెండర్స్,295 మంది యన్ఆర్ఐ లు, 18 - 19 సంవత్సరాల వయస్సు ఉన్న ఓటర్లు 20,547 మంది ఉన్నారన్నారు. 29 నవంబర్ 2024 నుండి 21మార్చి 2025 వరకు జిల్లాలో ఫారం 6,7,మరియు 8 సంబంధించి 10,384 దరఖాస్తులు రావడం జరిగింది అందులో 6007 దరఖాస్తులను పరిష్కరం చేయడం జరిగిందని, నిబంధనల మేరకు లేని 1396 దరఖాస్తులను తిరస్కరించడం జరిగిందని, 2987 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు.7 నియోజకవర్గాలలో 42 మంది ఏ ఈ ఆర్ ఓ లు,2141 మంది బి యల్ ఓ లు ఉన్నారని తెలిపారు.పోలింగ్ కేంద్రంలో 800 నుండి 1200 మంది ఓటర్లు కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉంటే అదనంగా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రెండు కిలోమీటర్లు పరిధి లోపల ఓటర్లు ఉండే విధంగా చూడాలని బి యల్ ఓ లకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని, ఇంకా ఎక్కడైనా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు లేకుంటే అలాంటి పోలింగ్ కేంద్రాలకు సంబంధించి వివరాలను జిల్లా ఎన్నికల అధికారి వారి దృష్టికి తీసుకు రావాలన్నారు. అన్ని రాజకీయ పార్టీ నాయకులకు సూచించారు. బిఎల్ఏలను నియమించుకోవాలని రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్, పవన్ కుమార్, సిబ్బంది, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి జిల్లా అధ్యక్షుడు నగేష్, బహుజన సమాజ్ వాదీ పార్టీ నుంచి శశికుమార్,బిజెపి నుండి వరప్రసాద్, కమ్యూనిస్టు పార్టీ నుంచి జిల్లా సెక్రెటరీ వందవాసి నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నుంచి జిల్లా చైర్మన్ , లీగల్ సెల్ బి రవి, తెలుగుదేశం పార్టీ పార్లమెంటు మీడియా కోఆర్డినేటర్ చంగయ్య, వైయస్సార్ పార్టీ వెంకటేశ్వర్లు, జనసేన పార్టీ నుంచి జిల్లా జనరల్ సెక్రెటరీ తులసి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : జేఎన్‌టియు కలికిరిలో జరిగిన ఇంటర్ కాలేజ్ స్పోర్ట్స్ మీట్‌లో వివిధ ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. హ్యాండ్ బాల్ పోటీల్లో పుత్తూరుకు చెందిన సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్ రెడ్డి, జనార్దన్ రాజులు విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు.

టీడీపీ సభ్యత్వ కార్డులు అందజేత

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : టిడిపి పార్టీ సభ్యత్వ కార్డులను ఆయా క్లస్టర్ వార్డు ఇన్చార్జిలకు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అందజేశారు. ఎక్కువ సంఖ్యలో పార్టీ సభ్యత్వాలు చేయించిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం



డాట్స్‌తో టీబీకి చెక్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఆరు నెలల నిరంతర డాట్స్ కోర్సును వాడటం ద్వారా టీబీ వ్యాధి గ్రస్తులు, వ్యాధి నుంచి విముక్తి పొందచ్చని ఏరియా ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ మధు సూచించారు. శ్రీకాళహస్తి టీబీ యూనిట్ విభాగం ఆధ్వర్యం లో సోమవారం ప్రపంచ క్షయ నివారణా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధి నివారణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉంటే ప్రభుత్వాస్పత్రిలో గల్లపరీక్షలు చేసుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే డాట్స్ చికిత్స ద్వారా 6 నుం చి 8 నెలల్లోపు సంపూర్ణ ఆరోగ్య వంతు లవుతారని స్పష్టం చేశారు. క్షయవ్యాధి నిర్ధారణ అయిన వారి కి ప్రభుత్వం నెలకు రూ.1000 పెన్షన్ సౌకర్యం కల్పిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీ విభాగ సూపర్వైజరు రామకృష్ణ, శివరాజు, గుణవతి తదితరులు పాల్గొన్నారు.

2030 నాటికి క్షయ లేని భారత్

ప్రజాశక్తి -నాయుడుపేట: 2030 నాటికి క్షయ రోగులు లేని భారతదేశాన్ని చూస్తామని ఎల్ ఏ సాగరం అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుబ్బారావు అన్నారు. ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి జిల్లా క్షయ, లెప్రసీ, ఎయిడ్స్ నిర్మూలన అధికారి శ్రీనివాసరెడ్డి సహకారంతో, డాక్టర్ సుబ్బారావు ఆధ్వర్యంలో సోమవారం నాయుడుపేట పట్టణంలో అవగాహన కార్యక్రమం చేపట్టి, ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నాయుడుపేట క్షయ వ్యాధి నిర్మూలన సూపర్వైజర్ బొమ్మన రమణయ్య పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజాన్ని తీసుకురావాలి

ప్రజాశక్తి– వెంకటగిరి టౌన్:సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, బంగారు పేట పిహెచ్ పరిధి, పురవీధులలో డాక్టర్లు ఆశ వర్కర్లు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయ రహిత సమాజం అందరి ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివకృష్ణ రెడ్డి, డాక్టర్ జినీత, సూపర్వైజర్ నాగేశ్వరరావు, సూపర్వైజర్ సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని మెగా ర్యాలీని తిరుపతి ఎస్.వి. మెడికల్ కాలేజ్ నుండి రుయా ఆసుపత్రి వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాల కృష్ణ నాయక్ సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రుయా హాస్పిటల్ టిబి సిడి డిపార్ట్ మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుబ్బారావ్, ఎస్.వి మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్, డిఎల్ఎటిఓ డాక్టర్ శ్రీనివాసుల రెడ్డి, డాక్టర్ ప్రేమానంద్ రిటైర్డ్ ప్రొఫెసర్ టిబిసిడి డిపార్ట్ మెంట్ (రుయా), డాక్టర్ శ్రీ హరి రావ్(ఐఎంఎ), డాక్టర్ రవిరాజు అడాప్ట్ ఎ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ పభుత్వేతర సంస్థ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, స్వచంద సేవా సంస్థలు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఎస్వి మెడికల్ కళాశాల, బొమ్మనకుంట ప్రాథమిక చికిత్సాలయం దగ్గర శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నర్సింగ్ ఎన్ఎస్ఎస్ యూనిట్ 16 విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

రేణిగుంటలో క్షయ నివారణ దినోత్సవం

ప్రజాశక్తి - రేణిగుంట: ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సంధర్భంగా రేణిగుంటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఛత్రప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2030 సంవత్సరం నాటికి క్షయవ్యాధి ని అంతం చేయాలనే లక్ష్యంతో అందరూ కలిసి పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఈ ర్యాలీ లో డిపిఎంఓ మునిసుబ్బరామి రెడ్డి, సిహెచ్ఓ హైమావతి, హెల్త్ సూపర్వైజర్లు నాగరాజు,కామరాజు, టిబి సూపర్వైజర్ సుమశ్రీ, ఎఎన్ఎంలు ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విభాగంలో మెక్స్‌ప్లోర్ 2025



ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మెక్స్‌ప్లోర్ 2025 సాంకేతిక సింపోజియం ప్రారంభమైంది. ఈ కార్యక్రమం మెకానికల్ ఇంజనీరింగ్‌లో తాజా పురోగతులను ప్రదర్శించడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుందని విభాగాధిపతి ప్రొఫెసర్ పి.హేమ వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అమరరాజ సీనియర్ మేనేజర్ రెడ్డప్ప నాయుడు హాజరై మాట్లాడుతూ మెకానికల్ ఇంజనీరింగ్‌లో నైపుణ్యాల అభివృద్ధి, పరిశ్రమ-సంబంధిత నైపుణ్యాల ప్రాముఖ్యతపై తన అనుభవాలను పంచుకున్నారు. కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్. సుబ్బారావు అధ్యక్షత వహించి, మెకానికల్ ఇంజనీరింగ్‌లో కృత్రిమ మేధస్సు కీలక పాత్రను వివరించారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఆచార్య పి. హేమ మాట్లాడుతూ మెక్స్‌ప్లోర్ 2025 విద్యార్థులు, నిపుణులకు ఆలోచనల మార్పిడి, కొత్త క్షితిజాలను అన్వేషించడానికి ఒక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. కన్వీనర్ ప్రొఫెసర్ పి.వి. రామయ్య సింపోజియంలో సాంకేతిక పత్ర ప్రజెంటేషన్లు, వర్క్‌షాప్‌లు, ప్రాజెక్ట్ ప్రదర్శనలు, ఇంటరాక్టివ్ సెషన్‌లు వంటి వివిధ కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. మెక్స్‌ప్లోర్ 2025, మెకానికల్ ఇంజనీరింగ్‌లో తాజా పోకడలు, పురోగతులను ప్రదర్శిస్తూ, విద్యార్థులు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణుల మధ్య ఆవిష్కరణ, సహకార స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగా విజ్ఞాన విభాగ విద్యార్థులు

పాండిచ్చేరి అరవిందో యోగాసన కేంద్రం పర్యటన

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలోని యోగా విజ్ఞాన విభాగం పాండిచ్చేరికి విద్యా- విజ్ఞాన పర్యటన నిమిత్తం విశ్వవిద్యాలయం తరఫున విద్యార్థులతో కలిసి వెళ్లారు. ఈ కార్యక్రమానికి విభాగాధిపతి డా.తపన్ కుమార్ ఘడై కోఆర్డినేటర్గా వ్యవహరించి విద్యార్థులు యోగ సంబంధిత జ్ఞానాన్ని సంపాదించడం కొరకు విభాగం ద్వారా ప్రారంభించడం జరిగినదన్నారు. యోగా థెరపీలో పిజి డిప్లొమా బిఎస్సి యోగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యోగా అధ్యయనాలు, వెల్నెస్ అభ్యాసాలు మరియు వాటి వాస్తవ ప్రపంచ అనువర్తనాలకు విద్యార్థులకు ఆచరణాత్మక అవగాహన కల్పించడమే ఈ పర్యటన లక్ష్యం అని చెప్పారు. అనుభవపూర్వక అభ్యాసం ప్రాముఖ్యతను, అటువంటి విద్యా విహారయాత్రలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఎలా దోహదపడతాయో అధ్యాపక బృందం నొక్కి చెప్పారు. ఈ విద్యా పర్యటన విద్యార్థులకు యోగాపై పాఠ్యపుస్తకాలకు మించి అవగాహన పెంచుతుందని, యోగా రంగంలో, దాని చికిత్సా అనువర్తనాలలో విలువైన అంతర్దృష్టులు మరియు ఆచరణాత్మక అనుభవాలను అందిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు డా.ఆర్. లక్ష్మీ నారాయణ, డా.టి.శివ కుమార్, డా.కె.సి.ఎస్ లోకేష్, డా.ఇ.పి నాగలక్ష్మి, డా.ఎం.అజయ్ కుమార్, డా.వి.గోవర్ధన్ రెడ్డి, డా.రాహుల్ కుమార్ శర్మ, ఎం.ఎస్.సి, బి.యస్.సి విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతి ఎన్‌సిసి గ్రూప్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్:తిరుపతి, ఎన్‌సిసి గ్రూప్ కమాండర్ ఆధ్వర్యంలో, రిపబ్లిక్ డేలో అత్యంత ప్రతిభ కనపరిచిన క్యాడేట్లను ఢిల్లీ హెడ్ క్వార్టర్స్‌లో ఎన్సిసి కేంద్రంలో గ్రూప్ కమాండర్ ఘనంగా సత్కరించారు. అవార్డులు తెచ్చిన క్యాడెట్‌లను ఎన్‌సిసి తిరుపతి గ్రూప్ హెడ్‌క్వార్టర్స్‌లో గ్రూప్ కమాండర్ సత్కరించారు. ఈ సత్కార కార్యక్రమంలో సీనియర్ ఎన్‌సిసి అధికారులు, అసోసియేట్ ఎన్‌సిసి అధికారులు (ఎఎన్‌ఓలు), సిబ్బంది, క్యాడెట్ల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మురుగు నీటి కాలువల్లో పూడికతీత

ప్రజాశక్తి -ఏర్పేడు : మండలంలోని యండి పుత్తూరులో సర్పంచ్ మోహనప్రియ ఆధ్వర్యంలో గ్రామంలో సోమవారం మురుగు నీటి కాలువలల్లో పూడికతీత పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మోహనప్రియ మాట్లాడుతూ కాలువల్లో చెత్తచెదారం ఎక్కువగా పేరుకుపోయి, నీరుపోకుండా దుర్గంధంగా తయారయ్యాయన్నారు. గ్రామస్తులు కాలువల్లో చెత్తచెదారం వేయొద్దని కోరారు.

కాలుష్య నియంత్రణ బోర్డు ఉద్యోగ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: రేపటి నుండి మూడు రోజులపాటు జరగనున్న ఏపిపిఎస్సి ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ బోర్డులో అసిస్టెంట్ ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్, అనలిస్ట్ గ్రేడ్-2 పోస్ట్, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టులకు సంబంధంచిన పరీక్షలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో APPSC నుండి ఐ. పద్మ లలిత, సెక్షన్ ఆఫీసర్ (మానిటర్), శివ ప్రసాద్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

ఎస్.కె.ఆర్‌లో అకడమిక్ ఆడిట్



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ఎస్.కే.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలకుగాను అకడమిక్ ఆడిట్ నిర్వహించారు.ఈ సందర్భంగా అకడమిక్ అడ్వైజర్స్ విడవలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి కే. రవిచంద్రరెడ్డి, ఉదయగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి కె.సి.విక్రమ్‌లు, ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని వివిధ విభాగాలను పరిశీలించి, సబ్జెక్టుల వారీగా గత రెండు సంవత్సరాలుగా జరిగిన విద్యా ప్రమాణాల రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదవ తరగతి గణిత పరీక్ష

మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ఇద్దరు విద్యార్థులు డీబార్

ప్రజాశక్తి - తిరుపతి: పదో తరగతి పరీక్షల్లో నాలుగోరోజైన సోమవారం గణిత పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. తిరుపతి జిల్లాలో 164 పరీక్ష కేంద్రాల్లో, 31 సిట్టింగ్, 10 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 164 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 1526 మంది ఇన్విజిలేటర్ల పర్యవేక్షణలో నిర్వహించిన పరీక్షకు మొత్తం 27,143 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా వారిలో 26,625 మంది విద్యార్థులు మాత్రమే పరీక్షకు హాజరయినట్లు తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కేవి ఎన్ కుమార్ పేర్కొన్నారు. మిగిలిన 518 విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు తెలిపారు. అధికారులు 44 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన తనిఖీలో ఇద్దరు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్కు పాల్పడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్‌కు పట్టుబడంతో వారిద్దరినీ డీబార్ చేసినట్లు తెలిపారు.

శాస్త్రోక్తంగా శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి

పుష్పయాగానికి అంకురార్పణ



ప్రజాశక్తి-రామచంద్రపురం (చంద్రగిరి) శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మార్చి 25న జరుగనున్న పుష్పయాగానికి సోమవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. సాయంత్రం పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం చేపట్టారు. మార్చి 25న ఉదయం 10 నుండి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేస్తారు. మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు పుష్పయాగం జరుగనుంది. ఇందులో తులసి, చామంతి, గన్నేరు, మొగలి, మల్లె, జాజి సంపంగి, రోజా, కలువలు వంటి పలురకాల పుష్పాలతో స్వామివారికి అభిషేకం చేస్తారు. బ్రహ్మోత్సవాల్లో అర్చక పరిచారకులు, అధికార అనధికారులు, భక్తుల వల్ల తెలియక ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహిస్తారు. ఈ యాగం నిర్వహణ వల్ల సమస్తదోషాలు తొలగిపోతాయని విశ్వాసం. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజకుమార్, రమేష్, ఇతర అధికారులు ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన మిని వ్యాన్.. ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - సత్యవేడు: ద్విచక్ర వాహనంపై వెళుతున్న నలుగురు యువకులను ఎదురుగా వస్తున్న మినీ టెంపో వ్యాన్ ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనం మేరకు సత్యవేడు మండలం, కన్నవరం నుండి సత్యవేడు పట్టణానికి వచ్చే రహదారిపై సోమవారం సాయంత్రం సత్యవేడుకు చెందిన భరత్ (16), ఉలవ చేనుకు చెందిన పవన్ (17), బీరు కుప్పానికి చెందిన ఉదయ్ (16), సారథి (16)లు కలిసి ఒకే ద్విచక్ర వాహనంపై నలుగురు ప్రయాణిస్తుండగా ఓ మినీ వ్యాన్ ఎదురుగా వస్తూ వారి ఢీకొట్టి పోవడంతో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, వారిలో సారథి పరిస్థితి విషమంగా ఉంది. అతన్ని అత్యవసర చికిత్స నిమిత్తమై తిరువళ్లూరు జనరల్ ఆసుపత్రికి తరలించగా, మిగిలిన వారిని తిరుపతి రుయా ఆసుపత్రికి రెఫర్ చేసినట్లు సమాచారం. సమాచారం అందుకున్న స్థానిక సీఐ మురళి నాయుడు సత్యవేడు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి క్షతగాత్రుల వివరాలను తెలుసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పి-4 కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి-4 కార్యక్రమాన్ని ప్రజలందరూ కలిసి జయప్రదం చేయాలని తడుకు సర్పంచ్ వెంకటేష్ బొబ్బిలి యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం తడుకు పంచాయతీ సచివాలయంలో పి-4 కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు, పంచాయతీ ప్రజలు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసానిదే కీలక పాత్ర

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయూ కల్చరల్ అఫైర్స్ స్టూడెంట్ వెల్ఫేర్, సెట్విన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం శ్రీ పద్మావతి మహిళా కళాశాల, వర్సిటీల రెండు వేదికలలో నిర్వహించిన వ్యక్తిత్వ వికాస తరగతులను వర్సిటీ ఇంచార్జీ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, పద్మావతి కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నారాయణమ్మలతో ఆయా వేదికలలో కలిసి ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఛైర్మన్ అనిమిని రవి నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు విద్యార్థులు వ్యక్తిత్వ వికాసంపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ విసి ఆచార్య అప్పారావు, ఎస్వీయూ ప్రిన్సిపల్స్ నరసయ్య , సుబ్బారావు, కల్చరల్ అఫైర్స్ డైరెక్టర్ ఆచార్య మురళీధర్, వివేక్, ఎస్వీయూ పార్మసి కళాశాల, పద్మావతీ కళాశాల, విద్యార్దిని, విద్యార్దులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విద్యుత్ వినియోగదారులు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని పుత్తూరు విద్యుత్ శాఖ డివిజన్ అధికారి దేవఆశీర్వాదం తెలిపారు. పుత్తూరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వం నిర్వహించే వినియోగదారుల సమస్యలపై సోమవారం సూపర్ ఇంటెండింగ్ ఇంజనీర్ ఆపరేషన్ సర్కిల్, తిరుపతి వారి ఆదేశాల మేరకు పుత్తూరు డివిజన్‌లో వినియోగదారుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడిఈ శంకరయ్య, రమేష్, ఏఈలు,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ ఏపీ ఎస్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలంలో ధాన్యం కొనుగోలు వ్యాపారులు కాటాల మోసాలకు పాల్పడుతున్నారని జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు రంగయ్య మండిపడ్డారు. గూడూరు నుంచి ఏర్పేడు వరకు ఉన్న అన్ని మండలాలలో వరి ధర తగ్గించేసారని, ఒక బస్తా 75 కేజీలు అయితే రివాజు రూపంలో 80 కేజీలు వేయాలని, చివరకు తూకంలో మోసం చేసి 85 కేజీలు దాకా గుంజుకుంటున్నారని, ధర చూస్తే మాత్రం ఒక బస్తాకు గాను 1700 రూపాయల మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. ఇలాంటి దళారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ దృష్ట్యా సారించి రైతులకు మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత ఒక వారం లోపే రైతుల అకౌంట్లోకి సొమ్మును జమ చేయాలని జిల్లా రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

క్షయ వ్యాధిని తరిమి కొడదాం



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ వర్ధన్, డాక్టర్ రమేష్‌లు మాట్లాడుతూ ఆసుపత్రిలో ఉన్న ఆర్టీపిసిఆర్ మెషిన్ ద్వారా ఉచితంగా గళ్ళ పరీక్షలు ద్వారా టిబి అని నిర్ధారణ అయితే మందులు ఉచితంగా ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది లు పాల్గొన్నారు.